క్లుప్తంగా

నేటి నుంచి చౌడేశ్వరీ ఉత్సవాలు



మద్దూరు: మండలంలోని చౌడేశ్వరీదేవి ఉత్సవాలు నేటినుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం అమ్మవారికి ఊరేగింపు అనంతరం అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మంగళవారం తెల్లవారు జామునుంచి అఖండ జ్యోతుల ఊరేగింపు నిర్వహించడంతోపాటు ఆటపాటలు కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు విఠల్, బాల్‌రాజ్, మహాదేవ్, రామకృష్ణ తెలిపారు.

పెట్రోల్ బంకు నిర్వాహకులపై చర్య తీసుకోవాలి

మరికల్: మండల కేంద్రంలో నామమాత్రంగా ఉన్న పెట్రోల్ బంకు నిర్వాహకులపై సివిల్ సప్లయ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులు, రామకృష్ణ, రఘు అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో ఉన్నా మూడు పెట్రోల్ బంకుల్లో డిజిల్, పెట్రోల్ కొరత సృష్టిస్తు బ్లాక్‌లో అమ్మకాలను చేపట్టారని మండిపడ్డారు. లీటర్ వెంబడి అదనంగా రూ. 20వసూలు చేస్తు బ్లాక్‌లో అమ్మకాలకు అలవాటుపడ్డ బంకుల యాజమాన్యంపై అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

ప్రహరీ నిర్మించాలి..



మాగనూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, మండల ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాపోతున్నారు. అదేవిధంగా ఈ మధ్య కాలంలో మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయని అంటున్నారు. గతంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణం చేపడుతామని తెలిపినా, నేటికి అది ఆచరణలోకి మాత్రం రావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కళాశాలకు ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

మాగనూర్: కోల్‌కతాలో ఐదు రోజుల క్రితం వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు డి. తిరుపతి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. వైద్యురాలిని అత్యాచారం చేసి హత్యచేసిన వారిని అరెస్టు చేసి వెంటనే శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడో చోట బాలికలపై అత్యాచారాలు జరుగుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు బాలికల రక్షణకోసం వివిధ పథకాలు చేపడుతన్నప్పటికీ వాటి అమలు మాత్రం నామమాత్రంగా జరుతున్నాయని, ఇది ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ మండల అధ్యక్షుడు బలరాం, ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, శ్రీనివాసులు, నర్సింహారెడ్డి, గోవర్ధన్, డేవిస్, దీప, ప్రశాంత్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై గుంతల పూడ్చివేత

అమరచింత: అమరచింత–మరికల్ ప్రధాన రహదారిలో పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పడ్డ గుంతలను సీఐ శివకుమార్, ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం పూడ్చివేసే కార్యక్రమం చేపట్టారు. పోలీస్‌స్టేషన్ ఎదుట రహదారి అధ్వానంగా ఉండటంతో ద్విచక్ర వాహనదారులతో పాటు ఆటో, జీపులలో ప్రయాణిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని గమనించిన సీఐ ఎర్రమట్టిని ట్రాక్టర్లతో తెప్పించి వాటిని పూడ్చి వేశారు.



ప్రమాదకరంగా మలుపులు

- కానరాని సూచిక బోర్డులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కన్మనూర్ వెళ్లే రహదారి మలుపు వద్ద బైక్‌ను ఢీకొట్టిన ఆటో (ఫైల్)



ప్రమాదాకరంగా ఉన్న రహదారి మలుపు

మరికల్: జాతీయ రహదారితోపాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారుల మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారుతున్నాయి. గతంలో అంతర్‌రాష్ట్ర రహదారిగా ఉన్న మహబూబ్‌నగర్, రాయచూర్ రహదారిని రెండు లైన్లుగా విస్తర్ణించి 167జాతీయ రహదారిగా మార్చారు. మహబూబ్‌నగర్ నుంచి రాయచూర్ వరకు అక్కడక్కడ మాత్రమే స్పీడ్ బ్రేకర్లు కన్పిస్తున్నాయి. దీంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ మలుపు వద్ద సరైన సూచిక బోర్డులు లేకపోవడమే కాకుండా రోడ్డుకు చెట్లు అడ్డంగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గడిచిన ఏడాదిలో మరికల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మలుపుల వద్ద రహదారులపై ఐదుగురు మృతి చెందగా, పదుల సంఖ్యలో క్షతగ్రాతులుగా మారారు.

గ్రామీణ రహదారులు అంతే..

మరికల్ నుంచి కన్మనూర్, మాధవరం, వెంకటపూర్, పూసల్‌పహాడ్, ఇబ్రహీంపట్నం వెళ్లే గ్రామీణ రహదారుల మలుపుల వద్ద ఎక్కడ కూడా ఒక సూచికబోర్డు కాని స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాట్లు చేయలేదు. దీంతో రాత్రి సమయంలో మరికల్ నుంచి సొంత గ్రామాలకు వెళ్లే వాహనదారులకు మలుపు వద్ద ఎదురుగా వచ్చేవాహనం కన్పించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మరికల్, నర్వ, మాధవరం, వెంకటాపూర్, ఇబ్రహీంపట్నం రహదారుల మలుపుల వద్ద కూడా తరచుగా ప్రమాదాలు జరుగుతుండటంతో రాత్రి సమయంలో ప్రయాణించాలంటే వాహనదారులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సూచికబోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మరికల్, కన్మనూర్, నర్వ మధ్యన ఉన్నా రహదారికి దాదాపు 50కి పైగా మలుపులు ఉన్నాయి. రాత్రి సమయంలో బైక్‌లపై సొంత గ్రామాలకు వెళ్లేటప్పుడు మలుపుల వద్ద అదుపుతప్పి ఎదురుగా వచ్చే వాహనలను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నాం. మలుపు వద్ద సూచికబోర్డులతో పాటు బ్రేకర్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఆంజనేయులు, ఆటో డ్రైవర్, కన్మనూర్

ముళ్లచెట్లను తొలగించాలి..



జాతీయ రహదారితో పాటు గ్రామీణ రహదారుల మలుపు వద్ద ఉన్నా ముళ్లచెట్లను తొలగిస్తే ఎదరుగా వచ్చేవాహనాలు కన్పించే అవకాశం ఉంది. రోడ్ల మలుపు వద్ద చిన్న, చిన్న స్పీడ్ బ్రేకర్లతోపాటు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి.

– అనంత్‌రెడ్డి, అప్పంపల్లి

బారికేడ్లను ఏర్పాటు చేశాం

జాతీయ రహదారిపై ప్రమాదాలను జరిగే స్థలాలను గుర్తించి బారికేడ్లను ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు తగ్గుతున్నాయి. ప్రైవేట్ పాఠశాల అసోసియేషన్ ఆధ్వర్యంలో పది బారికేడ్లను అందజేస్తే వాటిని జాతీయ రహదారిపై ఉన్న మలుపు వద్ద ఏర్పాటు చేశాం. మలుపు వద్ద కూడా సూచిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– మురళి, ఎస్‌ఐ, మరికల్

పోరాట యోధుడు పాపన్న గౌడ్



కోస్గిలో జయంతి వేడుకల్లో పాల్గొన్న గౌడ సంఘం నాయకులు



ధన్వాడలో..



రాయికోడ్‌లో..

కోస్గి: గుండుమాల్ మండల పరిధిలోని బోగారంలో ఆదివారం సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈమేరకు.. పలువురు యువకులు పాల్గొని పాపన్న చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

కోస్గి పట్టణంలో...

పట్టణంలోని శివాజీ చౌరస్తాలో గౌడ సంఘం నాయకులు సర్వాయి పాపన్న జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంతోపాటు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన గౌడ కులస్తులు పాల్గొన్నారు.

నర్వ: గోల్కొండ ఖిల్లాపై తెలంగాణ జెండాను ఎగురవేసిన గొప్ప వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని గౌడసంఘం నాయకులు అన్నారు. ఆదివారం సాయంత్రం రాయికోడ్‌లో ఆయన జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తాయన్నగౌడ్, రాఘవేందర్‌గౌడ్, సురేందర్‌గౌడ్, రామంజనేయులుగౌడ్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు శంకర్, శ్రీనివాసులు, చెన్నప్ప, రాము, రాజు, కృష్ణయ్య పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. కంచుకొట కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, జట్రం లక్ష్మయ్యగౌడ్, గోవర్ధన్‌గౌడ్, లంకల శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్, సత్యానారాయణ, బాలకిష్టయ్య, సుదర్శన్, ఆనంద్, నరేందర్, రాజేష్, కిషోర్‌గౌడ్, శ్రీను పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మరికల్: మండల కేంద్రానికి చెందిన ఓ పేదింటి కుటుంబంలో మృతి చెందిన కుర్వ నర్సమ్మ అంత్యక్రియల నిమిత్తం ఆదివారం సూర్యచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు.. ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మృతురాలి కుటుంబానికి ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాములు, గోవర్ధన్, రామకృష్ణ, రామకృష్ణారెడ్డి, తిర్మలయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

అమరచింత: పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణంలో కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయే అని విద్యార్థులతో పాటు తల్లితండ్రులు భయపడుతున్నారు. పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు సుమారు 540 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆడుకోడానికి వెళ్లాలన్న భయపడే పరిస్థితులు దాపరించాయి. వీటికి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా ఫలితం లేదని విద్యార్థుల తల్లి తండ్రులు తెలిపారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌పార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఊట్కూరు: ఊట్కూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు ఆదివారం వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా.. స్థానిక ఎల్బీనగర్ వీధికి చెందిన రోషనప్ప కుమారుడు రాంచందర్ అనే యువకుడు ఇటీవల కొనుగోలు చేసిన గృహానికి పేయింటింగ్ వేయడానికి రంగులను తీసుకెళ్తుండగా చెక్‌పోస్టు ప్రాంతంలో ఆటోనుంచి ప్రమాదవశాత్తు కిందపడంటంతో తలకు గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం నారాయణపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఆయన స్నేహితుడు ఎల్బీనగర్‌కు చెందిన బోజ నర్సింహులు కుమారుడు నవీన్ ద్విచక్రవాహనంపై పేట ఏరియా ఆస్పత్రికి వెళ్తుండగా తిప్రాసిపల్లి వద్ద వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో స్థానికులు పేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

దయాకర్‌రెడ్డికి ఘన నివాళి



మాగనూర్‌లో మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నర్వ: నిత్యం ప్రజాశ్రేయస్సే ధ్యేయంగా ప్రజల కోసం పనిచేసిన వ్యక్తి మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి అని నాయకులు కొత్తకోట సిద్దార్థరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన జయంతి సందర్భంగా మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దయాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి ఆయన అభిమానులకు తినిపించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ..నియోజకవర్గ అభివృద్ధి కోసం తన శాయశక్తుల ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రామారెడ్డి, కృష్ణయ్య, జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కుర్మారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు, రఫీ, రాములుగౌడ్, చెన్నయ్యసాగర్, శరణప్ప, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మాగనూర్: మక్తల్ మాజీ ఎమ్మెల్యే దివంగత నేత దయాకర్‌రెడ్డి జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. స్థానిక బస్టాండ్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, వడ్వాట్ రవీందర్, వాకిటి శ్రీనివాసులు, దండు సత్యనారాయణ, జానప్ప, వేణుగోపాల్, నరేష్, రాజశ్వేర్‌రెడ్డి, మౌళాలి, వర్కూర్ ఆంజనేయులు, వేణుగోపాల్, వాబయ్య, మహాదేవ్, మహేష్, రవి పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని మేయిన్ బజార్ చౌరస్తాలో ఆదివారం దివంగత మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి జయంతి సందర్భంగా అభిమానులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు విఘ్నేశ్వర్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, ఎల్కోటి జనార్దన్‌రెడ్డి, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నర్వలో..



ఊట్కూరులో

అటెన్షన్ ప్లీజ్

వర్షం వస్తే కట్ట ఎక్కాల్సిందే..



భారీ వర్షాలు వస్తే చాలు రైలు కట్ట వంతెన కింద నీళ్లు నిల్వడంతో కట్టపై నుంచి రావాల్సిన పరిస్థితి వస్తుంది. మరికల్ ఇబ్రహీంపట్నం, పెద్దచింతకుంట, ఎలిగండ్ల బూడ్యగానితాండ గ్రామాలకు వెళ్లే రహదారుల పైనుంచి మహబూబ్‌నగర్, మునీరాబాద్ రైల్వేలైన్ వెళ్లడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– మరికల్

సంప్రదించవలసిన అధికారి: వెంకటేష్, ఏఈ సెల్: 9440875141

రెడ్డిపల్లిలో తాగునీటి ఎద్దడి

- అవస్థలు పడుతున్న గ్రామస్తులు



రెడ్డిపల్లిలో ట్యాంకరు ద్వారా నీటి సరఫరా (ఫైల్)

గండేడ్: మండలపరిధిలోని రెడ్డిపల్లిలో నీటి ఎద్దడి నెలకొంది. రెండు మూడు నెలలుగా నీటి సరఫరా సక్రమంగా లేకపోవండంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి నీటిని సరఫరా చేసే బోరు సల్కర్‌పేట్ సబ్‌స్టేషన్ సమీపంలో ఉంది. మహబూబ్‌నగర్–చించోళి రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామానికి సరఫరా చేసే పైప్‌లైన్ పగిలిపోయింది. విషయాన్ని గ్రామస్తులు నేషనల్ హైవే వాళ్ల దృష్టికి తీసుకెళ్లారు. అయితే వాళ్లు ఈ రోజు.. రేపు అంటూ కాలయాపన చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో చేసేది లేక ట్యాంకరుతో నీటిని గ్రామానికి సరఫరా చేస్తూ వచ్చారు. అయితే గత నాలుగు రోజులుగా అది కూడా లేకపోవడంతో గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పొలాల వద్ద తెచ్చుకోవడంతో పాటు కొంతమంది ఫిల్టర్ నీటిని కొనుక్కొని వాడుకుంటున్నట్లు పేర్కొంటున్నారు. కార్యదర్శికి, ఎంపీడీఓకు వివరించినా తమ గోడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతు చేసి నీటిసమస్య లేకుండా చూడాలని కోరుతున్నారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను వివరణ కోరగా పైపులైను డ్యామేజీ అయిన విషయం నేషనల్ హైవే అధికారులు, కాంట్రాక్టర్ల దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో పాటు ఎంపీడీఓకు లిఖితపూర్వకంగా ఇచ్చామని పేర్కొన్నారు. రెండు మూడు రోజులుగా వారిని ఒత్తిడి చేయడంతో సోమవారం వచ్చి మరమ్మతులు చేస్తామని చెప్పారని వివరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



టెన్త్ ఫొటోలతో రూపొందించిన మెమంటోలతో పూర్వ విద్యార్థులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని శ్రీ హంస వాహిని ఉన్నత పాఠశాలలో 2009–10బ్యాచ్ పదోతరగతి చదువుకున్న విద్యార్థులు స్థానిక ఎస్‌వీఎస్ కళాశాల ఆవరణలో ఆదివారం కలుసుకున్నారు. ఈ మేరకు.. వారు చదువుకున్న పాఠశాల ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులను ఆహ్వానించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా 14 సంవత్సరాల తర్వాత కలుసుకున్న పూర్వ స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, వారి జీవిత విషయాలను చర్చించుకున్నారు. అంతకుముందు మృతిచెందిన గణిత ఉపాధ్యాయుడు, రంజిత్, తోటి స్నేహితులు భరత్, శ్రీనివాస్, ఆంజనేయులకు సంతాపం వ్యక్తం చేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం టెన్త్ నాటి ఫొటోలతో రూపొందించిన మెమొంటోలను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో టీచర్లు అనంత్‌రెడ్డి, గణపశ్రీనివాస్, రాజేష్‌కుమార్, సిద్రాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణరెడ్డి, విశ్వనాథ్, రఘువీర్, సంతోష్, కిరణ్, బాలరాజు, భవాని, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు పదును పెట్టాలి



బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి

గండేడ్: విద్యార్థులు సృజనాత్మకతకు పదును పెట్టాలని వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. డ్రీమ్ ఫోర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో భారత జాతీయోద్యమ చరిత్రపై టాలెంట్ పరీక్ష నిర్వహించారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లో కార్యక్రమం జరిగింది. ఈ టాలెంట్ పరీక్షకు ఉమ్మడి జిల్లాలోని ఆయా పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షల్లో సల్కర్‌పేట్ ఉన్నత పాఠశాల పదోతరగతికి చెందిన విద్యార్థి శివకుమార్ మొదటి బహుమతి, తొమ్మిదో తరగతి విద్యార్థి అర్చన ద్వితీయ బహుమతి సాధించారు. కాగా ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్‌రెడ్డి వారికి బహుమతులు అందజేశారు. ఫౌండేషన్ లైబ్రరీ చైర్మన్ జనార్దన్, సల్కర్‌పేట్ ఫిజికల్ సైన్స్ టీచర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఆత్మకూర్: పట్టణానికి చెందిన నాయీ బ్రాహ్మణ సంఘం నాయకుడు గోవర్ధన్ (45) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, రవికుమార్ దంపతులు రూ.10వేలు ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ముఖద్వారం ఏర్పాటుకు..

దేవరకద్ర: వెంకటాయపల్లిలో ప్రసిద్ధి చెందిన రంగనాయక స్వామి ఆలయంనకు వెళ్లే రహదారిలో ముఖద్వారం నిర్మాణం కోసం ఆదివారం భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన రఘుపతిసాగర్ అనే భక్తుడు తన తల్లిదండ్రులు కందూరి వెంకటయ్య, కిష్టమ్మల జ్ఞాపకార్థం నిర్మాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ నాయకులు కొండ ప్రశాంత్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు హాజరయ్యారు.